# తెలిసొచ్చింది

కాకాని కమల



మధ్యాహ్నం పన్నెండు దాటుతోంది.

నడవాలో పడుకుని వచన రామాయణం చదువుకుంటున్న రమణమ్మ ''పోస్ట్'' అన్న కేకకి లేచి వరండాలోకి వచ్చి గుమ్మంలో పడ్డ ఉత్తరం తీసింది.

దస్తూరీ చూస్తూనే గుర్తు పట్టింది.

మూడో కూతురు దుర్గ రాసింది.

''పిచ్చిమొద్దు ఈ మధ్య రోజూ కల్లోకి వస్తోంది'' అనుకుంటూ సంబరంగా కవరు విప్పింది.

''అమ్మా! ఈమధ్య నువ్వు అస్తమానం కళ్లల్లో మెదులుతున్నావ్. నిన్ను చూడాలని అనిపిస్తోంది. అన్నయ్య, వదిన బాగున్నారా? మీ అందర్నీ చూడక ఏడాది దాటిపోతూంది. కిరణ్ ఇప్పుడిప్పుడే లేచి నిల్చుని అడుగులు వెయ్యడానికి ప్రయత్నిస్తున్నాడు. చిన్న చిన్న మాటలు వస్తున్నాయి.

వంటి పిల్లాడితో ఇక్కడ చేసుకోవడం కుదర్దు, శ్రావణమాసంలో రమ్మని అన్నయ్య ఉత్తరం రాస్తాడేమో అక్కడికి వచ్చి వరలక్ష్మి వ్రతం. నోముకుందామని అనుకున్నాను. కానీ మీరు రమ్మన లేదు. కనీసం దసరాకైనా పిలుస్తారనుకున్నాను. నిన్ను చూడాలని కోరికగా వుంది. దీపావళికైనా అన్నయ్య ఉత్తరం రాస్తే వద్దాం అనుకుంటున్నాను''

దుర్గ ఉత్తరం మరికొంత అలాగే సాగింది.

కళ్లజోడు తీసి మసకబారిన అద్దాలు పైట చెంగులో తుడిచి కళ్లు ఒత్తుకుంది రమణమ్మ.

మనసు కలకబారింది.

కూతురు రాసిన ఉత్తరం చూస్తుంటే దాన్ని చూసినంత సంబరం కలిగింది.

దోగాడే మనవడే కళ్లముందు కదిలాడు.

రమణమ్మకి ముగ్గురు కూతుళ్లు ఒక్కడే కొడుకు భాస్కర్.

ఆరేళ్ల క్రితం భర్త గతించాడు.

అప్పట్నుంచి భాస్కరే అన్నీ సమర్థించుకుంటు న్నాడు.

ఏడాది క్రితం దుర్గ తొలిచూలు పురిటికి వచ్చింది.

ఏడోనెల రాగానే తీసుకువచ్చారు. కొడుకు పుట్టాడు. వాడికి మూడోనెల రాగానే బారసాల చేసి పంపించాడు. ఇప్పుడు వాడికి ఏడాది నిండింది.

''తనకీ దుర్గని చూడాలనే వుంది. పై ఇద్దరి చూసికూడా చాన్నాళ్లయింది. పోనీ దుర్గ రాసినట్లు ఈ దీపావళికి దుర్గతోపాటు మిగతా ఇద్దరాడపిల్లల్ని కూడా పిలిస్తే అంతా కలసి దీపావళి జరపుకున్నట్లు వుంటుందీ, ఏడాదికి ఒకసారి అయినా ఆడపిల్లల్ని గుమ్మంలోకి పిలిచినట్లు అవుతుంది'' అనుకుంది రమణమ్మ.

భాస్కర్ క్యాంపుకి వెళ్లాడు. రాత్రికో రేపో వస్తాడు. సాయంత్రం కోడలు జ్యోత్స్న ఆఫీసు నుంచి రాగానే ఈ విషయం చెప్పాలి అనుకుంది ఉత్తరం మడిచి రామాయణ గ్రంథంలో పెడుతూ

అంతలో పనిమనిషి వస్తే అంట్లగిన్నెలు వేసింది.

రమణమ్మ పదేపదే ఉత్తరం చదువుకోవడం చూసి ''ఏంటమ్మగారూ! తవరికి ఏడ్నుంచి అయినా ఉత్తరం వచ్చిందా?'' అంది పనిమనిషి అంజమ్మ.


''అవునే! మా మూడో అమ్మాయి దుర్గ రాసింది. నన్ను చూడాలని వుందిట పిచ్చిమొద్దుకి. ముగ్గురు ఆడపిల్లల్ని దీపావళికి పిలుద్దాం అనుకుం టున్నాను. నాకు వాళ్లు కళ్లల్లో మెదులుతున్నారు.''

''ఇంకేం పిలిపించండి. నేను పనిలోకి కుదురు కున్నాక మీ అమ్మాయిలెవర్నీ చూడలేదు'' అంది అంజమ్మ.

అంతలో కాన్వెంట్ నుంచి మనవలిద్దరూ రావడంతో వాళ్లకి టిఫిన్ పెట్టి బోర్నవిటా కలిపి ఇచ్చి తను కాస్త కాఫీ తాగి రాత్రికి వంట-పనిలో నిమగ్నం అయింది.

పిల్లలిద్దరూ వరండాలో చాపేసుకుని పుస్తకాలు ముందేసుకున్నారు.

ట్యూషన్ టీచర్ వస్తుంది.



కొడుకూ కోడలు ఉద్యోగస్థులు.

రమణమ్మ ఉదయం పూట మడిగట్టుకుని వంట చేస్తుంది.

రాత్రి వంట తను చేస్తానంటుంది కోడలు.

కానీ రమణమ్మ "ఒద్దులే అమ్మాయి. ఇందులో పెద్ద పనేముంది. నా ఒంట్లో ఓపిక వుంది కదా. అయినా పగలంతా నాకు పనేముంటుంది?" అని రమణమ్మే రాత్రి వంట కూడా చేస్తుంది.

రమణమ్మకి అరవైఏళ్లు వస్తున్నాయి.

అయినా వెనుకటి కాలం మనిషి కనుక పిడిరాయిలా బాగానే వుంటుంది.

సాయంత్రం ఆరు దాటుతుంటే కోడలు వచ్చింది.

రమణమ్మ సంబరంగా దుర్గ రాసిన ఉత్తరం చూపించింది.

"ఒసేయ్ అమ్మాయ్ జ్యోత్స్న! నీ ఆడపడుచులు ముగ్గుర్నీ దీపావళికి రమ్మని రాద్దాం అనుకుంటున్నానే. వాళ్లని చూడక చాలారోజులు అయింది. అదీగాక పురుడోసుకుని వెళ్లిన దుర్గని మళ్లా గుమ్మంలోకి పిలవలేదు. ఏడాది అయింది" అంది.

జ్యోత్స్న తల తిప్పుకుని "ఇంకోసారి ఎప్పుడన్నా చూద్దాంలెండి" అంది.

"ఇంకోసారి అంటే ఎప్పుడే? పై ఇద్దరు గుమ్మంలోకి రాక ఏణ్ణర్థం అయిపోతోంది. ఆడపిల్లల్ని ఏడాదికి ఒక్కసారన్నా గుమ్మంలోకి పిలవకపోతే ఏం బాగుంటుందే? అయినా నీ పెత్తనం ఏమిటి? వాడు నా కొడుకు" రమణమ్మ నోటి మాట పూర్తి కాకముందే జ్యోత్స్న సర్రున లేచింది.

"ఇది నా ఇల్లు. నా పెత్తనం ఎందుకు లేదు? నా భర్త మీద నా పెత్తనం వుండదా? ఆయనపైబడ్డ అప్పులు, అగచాట్లకి నా బాధ్యత వుండబట్టేకదా నేను ఉద్యోగం చేస్తున్నాను. పగలంతా చాకిరి చెయ్యడానికి నాకేం సరదా లేదు. ప్రేమలు, ఆపేక్షలు అందరికీ వుంటాయి. కానీ దాంతోపాటు ఇంత మాట కూడా వుంటే బాగుంటుంది. ఏడాదికి నాలుగుసార్లు అయినా కూతుళ్లని అల్లుళ్లని పిలువమ్మ. మామగారు పోయేనాటికి మాకు చిల్లిగవ్వ ఆస్తి మిగల్చలేదు. సరికదా అరవైవేల అప్పు మిగిల్చారు. అదేం అంటే ఆడపిల్లల పెళ్ళి బాధ్యత తప్పించాం అంటున్నారు. మీ అబ్బాయికి నెలనెలా వచ్చే జీతంలో ఆ అప్పు కొంచెం కొంచెం కట్టుకుంటూ వచ్చేసరికి మా ప్రాణం కడగడుతుంది. దుర్గకి సూడిదలు అని, పురుడు, బారసాల అని అయిన ఖర్చు ఐదువేల దాకా అయింది. అదంతా నా జీతంలో చూసుకుంటున్నాను. ఇదికాక నా పిల్లలు, సంసారం ఖర్చు నాకుండనే వుంది. ఒకరి

తరువాత ఒకళ్లకి ఏదో ఒక రోగం. డాక్టర్ల మందులు. మీరూ చూస్తూనే వున్నారుకదా. ఇప్పుడు ముగ్గురు ఆడపిల్లల్ని, అల్లుళ్లని పండక్కి పిలవడం అంటే మాటలా? ఇంట్లోకి ఏదన్నా ముచ్చటగా సామాను కొనుక్కుందాం అనుకుంటే

ఎప్పటికప్పుడు ఏదో అడ్డంకిగా వుంది. ప్రేమలు, ఆపేక్షలు అందరికీ వుంటాయి. కానీ డబ్బు మూటలు కూడా వుంటే బాగుంటుంది. ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పడంకాదు, బయటకు వెళ్లి సంపాదించే వాళ్లకి తెలుస్తుంది కష్టం విలువ, డబ్బు విలువ.''

జ్యోత్స్న చిహాలున అక్కడ్నుంచి లేచి వెళ్లిపోయింది.

మనసుకి వాడిముళ్లు గుచ్చుకున్నట్లు రమణమ్మ ప్రాణం విలవిల్లాడింది.

అవమానంతో కళ్లనీళ్ల పర్యంతం అవుతుంటే చటాలున లేచి తన గదిలోకి వచ్చేసింది.

దుర్గని చూడాలని మనసు కొట్టుకుపోతోంది.

ఈమధ్య జ్యోత్స్న తరచూ ఇట్లాగే మాట్లాడుతోంది.

ఈ ఇంట్లో తను చాకిరీ చేసి ఇంత తినే మనిషిగానే చూడబడుతోంది. కానీ అత్త ఈ

ఇంటి పెత్తందారు, పెద్దదిక్కు అన్న గౌరవం పీసం ఎత్తు లేదు. కడుపులో ఈ బాధ ఎవరి దగ్గరైనా చెప్పుకోవాలనుంది.

కూతుళ్లు కాక ఇంకెవళ్లుంటారు?

దుర్గ దగ్గరికి వెళ్లి నాలుగురోజులుంటే తన విలువ, అవసరం ఈ ఇంట్లో ఉద్యోగస్థురాలైన తన కోడలికి తెలిసివస్తుంది.

అయినా ఆ చెప్పేదేదో సౌమ్యంగా చెప్పవచ్చుకదా?

రమణమ్మ కళ్లనీళ్ల పర్యంతం అవుతూ అల్మారా పై వున్న ట్రావెలింగ్ బ్యాగ్ అందుకోబోయింది.

చెయ్యి జారి గోడకి వున్న అత్తగారి ఫోటో బ్యాగుతోపాటు కింద పడబోతుంటే చప్పున చేతులు అడ్డం పెట్టి కింద పడకుండా పట్టుకుంది.

అప్రయత్నంగా రమణమ్మ మనసు నలభై ఏళ్ల వెనక్కి వెళ్లింది.

''ఒసే రమణా! మీ మామగారు పోయి రెండేళ్లు అవుతోంది. ఏదో ఆ తద్దినానికి రావడమే కానీ ఆడపిల్లలెవర్నీ మళ్లీ గుమ్మంలోకి పిలువలేదే. పోనీ ఈ సంక్రాంతికి అందర్నీ పిలుద్దామే. నలుగురం కల్సి సర్దాగా సంక్రాంతి పండుగ...''

''ఆ! పండగలు పబ్బాలకేం! డబ్బుంటే రోజూ పండుగలు చేసుకోవచ్చు. మోసేవాడికి తెలుస్తుంది గాడిదబరువు''

ఆ రోజు తను అత్తగారికి సౌమ్యంగా చెప్పలేదు.

అప్పుడు తన అత్తగారు కూడా ఇలాగే కూతురి దగ్గరికి ప్రయాణం అయింది.

ఆ రోజు ఆవిడ మనసు ఇప్పుడు తన మనసులాగే కష్టపడ వుంటుందా?

కూతుళ్లని చూడాలని ఆవిడ మనసు తన మనసులాగే తహతహపడి వుంటుందా?

కన్నకొడుకు ఇంట్లో స్వతంత్రం లేక పరాయిదానిలా ఆవిడ కూడా తనలాగే అల్లాడి వుంటుందా?

నాలుగురోజులు కూతురి ఇంట్లో వుండి అల్లుడి సొమ్ము తిని కొడుకు కోడలి మీద చాడీలు చెప్పినంతమాత్రాన తన జీవితం కష్టాలు గట్టెక్కిపోతాయా? తను లోకువై, కొడుకుని లోకువ చేసేకంటే ఇలాగే సర్దుకుపోతే సరిపోదూ?

డబ్బు ఇబ్బందులు వచ్చినా భర్త సంపాదనతో సంసారం సర్దుకుని పోయిన తను కొడుకు కోడలు విషయంలో ఎందుకు సర్దుకునిపోలేకపోతోంది?

రమణమ్మ ఆలోచిస్తూ బ్యాగ్ తీసి తిరిగి అల్మారాపై పెట్టి చేతిలో పటం జాగ్రత్తగా గోడకి తగిలించింది.

పటంలోని అత్తగారు రమణమ్మని చూసి ''ఇది ఇంతే. తెలిసొచ్చిందా?'' అని నవ్వుతున్నట్లు అనిపించింది.

❄ ❄




### శిక్ష

''ఎందుకేడుస్తున్నారండీ?'' పార్క్‌లో చెట్టు కింద కూర్చుని ఏడుస్తున్న సురేష్‌ను అడిగాడు వంశీ.

''నేను మా ఆవిడని చంపాలనుకున్నాను. వద్దని, అందుకు 14 ఏళ్ళ కారాగార శిక్ష పడుతుందని నా లాయర్ ఫ్రెండ్ హెచ్చరించడంతో చంపలేదు. ఆలోచించు. 14 ఏళ్ళ క్రితం నేనా పని చేసుంటే ఇవాల్టికి విడుదలయి స్వతంత్రుణ్ణి అయ్యేవాడ్ని. ఆవిడ ఇంకా బ్రతికే వుంది'' అంటూ మళ్ళీ ఏడవసాగాడు సురేష్.

—పి.వి.మురళీకృష్ణ (హైద్రాబాద్)



### గొప్ప!

'నా దృష్టిలో అమితాబ్ బచ్చన్ గొప్ప నటుడు కాదు. ఆయన చిత్రాలు అన్నీ విజయవంతం అయి ఉండవచ్చు. మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చి ఉండవచ్చు. అయినంత మాత్రాన గొప్పనటుడు ఎలా అవుతాడు... ఆయనకున్న లోపాలు ఆయనకే వున్నాయి!' అంటాడు నిన్న కాక మొన్న హీరో అయిన బిస్కెట్ ఫేస్ అరవిందస్వామి. 'బహుశా బొంబాయిలో అతని నటన అమోఘమన్నారేమో జనం..!'

—కృష్ణాజీ

